క్లుప్తంగా

ఎస్‌డీఎఫ్ నిధులతో బోరు



మద్దూరు: మండలంలోని కొమ్మురులో తాగు నీటి సమస్యను నివారించడానికి ఎస్‌డీఎఫ్ నిధులతో ఆదివారం బోరువేశామని ఎంపీడీఓ జయరాములు తెలిపారు. ఈ బోరు ద్వారా ఎక్కడైతే సమస్య ఉంటుందో ఆ కాలనీలకు నీటి సరఫరా చేస్తామని వివరించారు. కార్యక్రమంలో కొమ్మురు మాజీ సర్పంచ్ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

జులేమాన్‌సాప్ గంధోత్సవం



ఊట్కూరు: మండలంలోని పగిడిమారిలో 29న జులేమాన్‌సాప్ గంధ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆదివారం సదర్ ఆయూబ్, బంగ్లా అజీం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున గంధం ఊరేగింపు నిర్వహిస్తారని సాయంత్రం రెట్టపట్ల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వృద్ధాశ్రమానికి వంట పాత్రలు బహూకరణ

నారాయణపేట రూరల్: పట్టణంలోని వృద్ధాశ్రమానికి వంటపాత్రలను బహూకరించారు. మండలంలోని మద్దెల్‌బీడ్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆంగ్ల ఉపాధ్యాయుడు కేశే. పెద్దబాయి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి శకుంతల సొంత డబ్బులతో వంటపాత్రలను కొనుగోలుచేసి ఆదివారం అందించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వహకురాలు అనిత, శకుంతల కుటుంబ సభ్యులు రామకృష్ణారెడ్డి, సునీత, చిన్నారులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేనా..



మరికల్: మహిళల కోసం ఉచిత బస్సు పథకం అమల్లోకి వచ్చిన నాటినుంచి మండలంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోకి సక్రమంగా బస్సులు రావడం లేదు. దీంతో ప్రయాణికులు నిత్యం గంటల తరబడి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులకోసం బస్టాండ్‌లో ఎదురు చూస్తున్నారు. నారాయణపేట డిపోకు చెందిన బస్సుల మినహా బస్టాండ్‌లోకి హైదరాబాద్ డిపోకు చెందిన బస్సుల్లో ఒక్కటి బస్టాండ్‌లోకి వస్తే, మరోక బస్సు నేరుగా రోడ్డుపై వెళ్లిపోతుంది. ఈ విషయం తెలియని ప్రయాణికులు రాయచూర్, హైదరాబాద్ పట్టణాలకు వెళ్లాల్సినవారు బస్సులకోసం బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్నారు. గంటకు ఓ బస్సు బస్టాండ్‌లోకి రావడంతో రాయచూర్, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినిత్యం మరికల్‌లో రాత్రి 11గంటల వరకు రాయచూర్, హైదరాబాద్ బస్సులకోసం వేచి చూస్తున్నారు. ఇలా బస్సులు నిలపకుండా వెళ్లిపోవడంతో ప్రయాణికులు సొంత గ్రామాలకు వెళ్లేందుకు అద్దె వాహనాలు, లారీలు, ఆటోలను సంప్రందించి రాత్రివేళలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బెల్టుషాప్‌పై దాడి : కేసు నమోదు

అమరచింత: మండల పరిధిలోని మిట్టనంది మళ్లలో రాంరెడ్డి అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడులు నిర్వహించి 9.8 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు జరుపరాదన్నారు. కొన్ని నెలలుగా రాంరెడ్డి గ్రామంలో బెల్టు షాప్ నిర్వహిస్తూ.. మద్యం అమ్ముతున్నాడని తెలిపారు. రాంరెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అమరచింత: పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పురం లింగారెడ్డి తల్లి బాల కిష్టమ్మ(85) అనారోగ్యంతో మృతిచెందిందనే సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి లింగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆదివారం అమరచింతకు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

అంగన్‘వేడి’ కేంద్రాలు

- ఎండలకు తాళలేకపోతున్న చిన్నారులు
- వేసవి సెలవులు ఇవ్వాలంటున్న తల్లిదండ్రులు



అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారులు

మాగనూర్: ఎండలు దంచికొడుతున్నాయి. వార్షిక పరీక్షలు ముగియడంతో పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. కానీ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు మాత్రం రోజూ కేంద్రాలకు వెళ్లివస్తున్నారు. వేసవి సెలవులు ఇవ్వకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలు ఎండవేడిమికి తట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఈవైపు 42–44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాలుల తీవ్రత పెరుగుతోంది. ఉదయం 8గంటలకే ఇంటి నుంచి అడుగు బయట పెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు వెళ్లాలంటే వారిపై ఎండ ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించి నెలకు సరిపడా పౌష్టికాహారాన్ని ఇంటికే పంపించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. వేసవి సెలవుల కోసం లబ్ధిదారులు రోజు అడుగుతున్నా రని టీచర్లు అంటున్నారు. మండల వ్యాప్తంగా 33 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు ఒంటిపూట కొనసాగుతున్నాయి. మిగతా పాఠశాలల మాదిరిగా కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎండలకు ఇబ్బందిగా ఉంది..



ఎండలు కొడుతున్నా పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్తున్నాను. ఉదయ నుంచే ఎండలు తీవ్రమై బయట వెళ్లే పరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారులను బడికి ఎలా పంపించాలి. కేంద్రాలకు వేసవి సెలవులు ఇచ్చి పౌష్టికాహారాన్ని ఇంటికి పంపించాలని అధికారులను కోరుతున్నాం.

– లలిత చిన్నారి తల్లి, కొత్తపల్లి గ్రామం

వేసవి సెలవులు ప్రకటించాలి..



అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలని కోరుతున్నాం. వారం రోజులుగా ఎండల తీవ్రత మరి ఎక్కువగా ఉంది. ఉదయం పది దాటితే బయటకు రాలేకపోతున్నాం. అధికారులు ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని వెంటనే వేసవి సెలవులు ప్రకటించి, పౌష్టికాహారం ఇంటికే సరఫరా చేయాలి.

– సంగీత, కొత్తపల్లి గ్రామం

పంపించడం లేదు..



వేసవి ఎండకాలం కారణంగా చాలా మంది చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలంటే జంకుతున్నారు. ముఖ్యంగా వారి నుంచి పౌష్టికాహారం నెలకు సరిపడిన వాటిని నేరుగా ఇంటి వద్దకు అందించాలనే డిమాండ్ రోజు రోజుకు పెరుగుతుంది.

– లలితమ్మ, అంగన్‌వాడీ టీచర్ కొత్తపల్లి

నేటినుంచి ఊరడమ్మ మాత జాతర



ముస్తాబైన అమ్మవారి ఆలయం

దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్ గ్రామంలో వెలసిన ఊరడమ్మ మాత జాతర ఉత్సవాలు సోమవారం నుంచి మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నారు. జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక భజనలతో ప్రారంభిస్తారు. మంగళవారం మంగళ వాయిద్యాలతో గ్రామ పురవీధుల గుండా పల్లకిసేవ నిర్వహిస్తారు. అనంతరం గ్రామ సివారులోని పెదబావి నుంచి జల్దిబిందే ఉత్సవాలు, సాయంత్రం సామూహిక బోనాలు నిర్వహిస్తారు. మహిళలు ప్రత్యేక వంటకాలతో తయారుచేసిన నైవేద్యాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి రెట్టపట్లు కార్యక్రమం చేపట్టనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

బీసీలు బీజేపీకి మద్దతు తెలపాలి..



ధన్వాడ: పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే. అరుణమ్మకు ఓటువేసి గెలిపించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందె బాబయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కన్వెన్షన్‌హాల్‌లో ఓబీసీ సామాజిక సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ మంత్రి వర్గంలో 26మంది ఓబీసీలకు మంత్రి పదవులను ఇచ్చి ఓబీసీ సామాజిక వర్గాన్ని ఆదరించారన్నారు. మోదీ ప్రధానమంత్రి కావాలంటే బీసీలందరూ బీజేపీకి మద్దతుగా డీకే అరుణమ్మను ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య, అధికార ప్రతినిధి రవి కుమార్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, జెడ్పీటీసీ విమల, లక్ష్మిశ్యాంసుందర్, రాంచంద్రయ్య, వాకిటి మల్లేష్, సోమశేఖర్‌గౌడ్, రఘువీర్‌యాదవ్, నర్సింహులు, శివరాజ్, తిరుపతి, కొండయ్య, శ్రీనివాసులు, రవి కుమార్, మల్లయ్య, ఈశ్వరప్ప పాల్గొన్నారు

గ్రామాల్లో ఇంటింటి ప్రచారం



బిజ్జారంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

కోస్గి: బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో బిజ్జారం, నాచారం, ముంగిమళ్ల గ్రామాల్లో బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. మండలాధ్యక్షుడు సీబీ. వెంకటేష్ మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలో సుస్థిర పాలన అందుతోందని గుర్తు చేస్తూ, సంక్షేమా పథకాల గురించి వివరించారు. నాయకులు అల్లపురం సంగప్ప, వీరేశం, నారాయణ, వెంకట్‌రాములు, పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని భూనీడ్, రెనివట్ల తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ నాయకులు ఇంటింటి వెళ్లి బీజేపీ అభ్యర్థి డీకే. అరుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, శంకర్, రఘు, కాశన్న, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని అప్పంపల్లి, పస్పుల, మరికల్, పెద్దచింతకుంట, తీలేర్ తదితర గ్రామాల్లో



అప్పంపల్లిలో..

ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ మేరకు.. దేశ అభివృద్ధికోసం ప్రధాని మోదీ రైతులకు, పేదలకు అందిస్తున్న సంక్షేమపథకాల గురించి ప్రజలకు వివరించారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే. అరుణను అత్యధిక మెజారీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, వేణు, భాస్కర్‌రెడ్డి, రమేష్, బసిరెడ్డి, అశోక్, దేవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప ఉత్సవాలు



మక్తల్: కురువల ఆరాధ్యదైవమైన బీరప్ప దేవర ఉత్సవాలను ఆదివారం మండలంలోని మాద్వార్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బీరప్ప ఆలయం నుంచి భక్తులు పట్టం కట్టుకుని తమ ఊరేగింపుతో బయలుదేరి బీరప్ప ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. తమకు సంబంధించిన బంధువులు కొత్త వస్త్రాలు తీసుకొచ్చి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే సోమవారం బీరప్ప బండారు కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

అమరచింత: నిత్యం ఆన్‌లైన్ మోసాలు అధికమవుతూ అమాయక ప్రజలు మోసపోతున్నారని ఆన్‌లైన్ మోసాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సురేష్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ప్రధాన రహదారిపై ప్రజలకు ఆన్‌లైన్ మోసాలు, క్రికెట్ బెట్టింగ్‌లు, లోన్‌యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. వేసవి సెలవుల్లో తమ ఇంట్లో చిన్నారులు బావులు, చెరువుల్లో ఈత కోసం వెళ్తుంటారని వారి వెంట కుటుంబ సభ్యులు వెళ్లాలని సూచించారు. ఈత కోసం చిన్నారులను ఒంటరిగా పంపడం ద్వార ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. సరదాగా సాగే ఈత తమ కుటుంబంలో విషాదం నింపకూడదన్నారు. పదో తరగతి, ఏడో తరగతి చదువుతున్న మైనర్‌లకు బైక్‌లు ఇవ్వడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మండుతున్న ఎండల కారణంగా ప్రజలు ఉదయం పదకొండు గంటల వరకే బయట ఉండాలని, అవసరం అయితే తప్పా.. బయటకు రాకూడదన్నారు. వడగాల్పుల కారణంగా ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదాలు ఉన్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: వేసవి కరాటే శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా వైస్ చైర్మన్ చెన్న వీరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కింగ్‌షోటోకాన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 2వ తేదీన స్థానిక మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో ఉదయం 8 గంటలకు 26వ వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అదే విధంగా 3న షాసాబ్‌గుట్టలోని అల్‌నూర్ స్కూల్‌లో కూడా వేసవి కరాటే శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ మాట్లాడుతూ జూన్ 2వ వరకు వేసవి ఉచిత కరాటే శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు శిబిరాలు ఉంటాయని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు 9849301171 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కింగ్‌షోటోకాన్ చైర్మన్ లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్ పటేల్, కోశాధికారి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం



ఆత్మకూర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నాగరాజుగౌడ్

ఆత్మకూర్: యావత్తు దేశ ప్రజలందరూ కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని టీపీసీసీ అధికారప్రతినిధి, రాష్ట్ర గీతకారిత్మక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్ అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశాభివృద్ధిని విస్మరించి దేశం కోసం ధర్మం కోసం అంటు అధికారంలోకి వచ్చిన బీజేపీ మతరాజకీయాలు చేస్తూ విధ్వంసాలకు పాల్పడిన వారికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. చల్లాకు అత్యధిక మెజార్టీనిచ్చి సీఎం రేవంత్‌రెడ్డికి గిఫ్టుగా ఇవ్వబోతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసిరాజ్, నల్గొండశ్రీను తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన గురుకులాల విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని గురుకుల కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఇందులో ఎస్సీ గురుకుల కళాశాలలకు సంబంధించి మొదటి సంవత్సరంలో జిల్లాల వారీగా గద్వాలలో 72.21 శాతం ఉత్తీర్ణత సాధించారు. వనపర్తిలో 72.21, నాగర్‌కర్నూల్‌లో 73.4, మహబూబ్‌నగర్‌లో 80.89 శాతం, నారాయణపేటలో 77.92 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. రెండో సంవత్సరంలో వనపర్తి 83.28 శాతం, నాగర్‌కర్నూల్ 81 శాతం, మహబూబ్‌నగర్ 91 శాతం, గద్వాల 76.1, నారాయణపేట 82.3 శాతం నమోదైంది.

- ఎస్టీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 71.43 శాతం, వపపర్తి 95.38, మహబూబ్‌నగర్ 73.02, నాగర్‌కర్నూల్ 72.09, నారాయణపేట 71.63 శాతం సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో గద్వాల 84.21, వనపర్తి 94.67, నాగర్‌కర్నూల్ 85.85, మహబూబ్‌నగర్ 83.33, నారాయణపేట 91.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- టీఎస్‌ఆర్‌జేసీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 89.33, మహబూబ్‌నగర్ 97.53, రెండో సంవత్సరంలో గద్వాల 92.65, మహబూబ్‌నగర్ 98.8 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్‌లో కళాశాలలు లేవు.
- మోడల్ స్కూళ్లలో మొదటి సంవత్సరం వనపర్తిలో 50.17, నాగర్‌కర్నూల్‌లో 38.07, మహబూబ్‌నగర్‌లో 50, నారాయణపేటలో 47.2 శాతం ఉంది. రెండో సంవత్సరంలో వనపర్తిలో 69.6, నాగర్‌కర్నూల్‌లో 55.34, మహబూబ్‌నగర్‌లో 69.6, నారాయణపేటలో 46.86 శాతం ఉత్తీర్ణత సాధించగా గద్వాలలో కళాశాల లేదు.
- కేజీబీవీల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 73.84, వనపర్తిలో 74.2, నాగర్‌కర్నూల్‌లో 63.77, మహబూబ్‌నగర్‌లో 76.45, నారాయణపేటలో 72.59 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరంలో గద్వాలలో 83.9, వనపర్తి 83.3, నాగర్‌కర్నూల్ 75.58, మహబూబ్‌నగర్‌లో 85.84, నారాయణపేటలో 76.29 శాతం ఉత్తీర్ణత వచ్చింది.
- మైనార్టీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 83.87, వనపర్తిలో 73.21, నాగర్‌కర్నూల్‌లో 60.32, మహబూబ్‌నగర్‌లో 73.57, నారాయణపేటలో 75 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. రెండో సంవత్సరంలో గద్వాల 88.7, వనపర్తిలో 82.86, నాగర్‌కర్నూల్‌లో 85.25, మహబూబ్‌నగర్‌లో 86.6, నారాయణపేటలో 87.78 శాతం ఉత్తీర్ణత వచ్చింది.
- ప్రభుత్వ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 47.65 శాతం, వనపర్తిలో 35.68, నాగర్‌కర్నూల్‌లో 34.35, మహబూబ్‌నగర్‌లో 42.08, నారాయణపేటలో అత్యల్పంగా 29.61 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక రెండో సంవత్సరంలో గద్వాల 59.96, వనపర్తి 51.4, నాగర్‌కర్నూల్‌లో 49.8, మహబూబ్‌నగర్‌లో 50.94, నారాయణపేట 41.23 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.
- బీసీ గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో గద్వాల 88.35 శాతం, వనపర్తి 77.6, నాగర్‌కర్నూల్ 74.73, మహబూబ్‌నగర్ 72.44, నారాయణపేట 64.41 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. రెండో సంవత్సరంలో గద్వాలలో 93.44, వనపర్తిలో 84.97, నాగర్‌కర్నూల్‌లో 88.39, మహబూబ్‌నగర్‌లో 91.8, నారాయణపేటలో అత్యధికంగా 96 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో బంగారు పతకం



బసంత్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

నారాయణపేట రూరల్: మిడిల్ అండ్ డిస్టెన్స్ చాంపియన్‌షిప్ అథ్లెటిక్స్ పోటీలో జిల్లా క్రీడాకారుడు బంగారు పతకం సాధించాడు. ఆదివారం సూర్యపేటలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్న అండర్ 14 బాయ్స్ 600మీటర్ల పరుగుపందెంలో బసంత్ చక్కటి ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నాడు. అదేవిధంగా వందమీటర్ల బాలికల విభాగంలో శ్రీలత కాంస్యం సాధించింది. ఈమేరకు అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ రమణ, వైస్ ప్రెసిడెంట్ నందునామాజీ, ట్రెజరర్ అంబరీష్, డీవైఎస్‌ఓ వెంకటేష్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సింహులు అభినందించారు.

వైభవంగా ఎల్లమ్మ దేవర ప్రతిష్ఠాపనోత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నర్వ: మండల కేంద్రంలో ఎల్లమ్మ దేవర్ల నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హరిజన వాడలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఎల్లమ్మ దేవత విగ్రహాలను అర్చకుల వేదమంత్రోచరణల మధ్యన ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డిలు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

పోటీలు నైపుణ్యాన్ని వెలికితీస్తాయి



బహుమతి అందజేస్తున్న భాగన్నగౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: చిత్రలేఖన పోటీలు విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీస్తాయని స్వర లహరి కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు భాగన్నగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అకాడమీ కార్యాలయంలో ఆదివారం ప్రముఖ భారతీయ చిత్రకారుడు రాజా రవివర్మ జయంతిని పురస్కరించుకొని స్ఫూర్తి సామాజిక సేవ, యువజన కళా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ప్రముఖ కవి రంగినేని మన్మోహన్ మాట్లాడుతూ కళలు నేర్చుకోవడం వల్ల విద్యార్థులలో క్రమశిక్షణ, జీవన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా ప్రతాలు అందజేశారు. హార్మోనియం కళాకారుడు వేణుగోపాలాచారి, అకాడమీ డైరెక్టర్లు మేకల శ్రీనివాస్, డీకే.ఆంజనేయులు, సంస్థ సభ్యుడు జమాల్పూర్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న బీఆర్‌ఎస్, బీజేపీ



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రోజు రోజుకు బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు కనుమరుగవుతున్నాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం పట్టణంలోని 2, 22, 33, 46 వార్డుల బీఆర్‌ఎస్ కార్యకర్తలు, బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి వెంకటేశ్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు రాణి, ముడా డైరెక్టర్ మిర్యాల వేణుగోపాల్, ఆర్యవైశ్య నాయకులు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు బెక్కరి మధుసూదన్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, అవేజ్ అహ్మద్, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ కౌన్సిలర్ మహమూద్‌అలీ, మున్సిపల్ కోఆప్టడ్ మెంబర్ అర్షద్ అలీ ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి

ఎన్టీఆర్ శతజయంతి స్మారకార్థం రూ.100 కరెన్సీని ఆర్‌బీఐ ముద్రించింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌తో కలిసి కరెన్సీని ఆవిష్కరించారు. ఎన్టీఆర్‌కు ఇది నిజమైన నివాళి అని అన్నారు. టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటయ్య, మురళి, యాదయ్య, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: పేదల కోసం పుట్టిందే కాంగ్రెస్ పార్టీ అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెంకటమ్మకుంటతండా, దాచక్‌పల్లి, దయ్యాలమర్రితండా, గుడ్డిమల్కాపూర్, టంకర, రాంనాయక్‌తండాల్లో పర్యటించారు. దాచక్‌పల్లి మాజీ సర్పంచ్ బాలకిష్టారెడ్డి పార్టీలో చేరారు. సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.